# కథ

# ఎంత ఎంత ఎడమైతే...

యస్. సుభాషిణి

అరచేతిలో స్వర్గమున్నంత కాలం చీకూ చింతా ఉండదు సరికదా ఒకలాంటి ధీమా మనిషిని నిలవనీయదు. ఈ సుఖం శాశ్వతమనిపిస్తుంది. హఠాత్తుగా అది కాస్తా చెయ్యి జారిపోయే పరిస్థితి వచ్చి, దాన్ని దక్కించుకోడానికి పడే తపనాగ్నిలో కొత్తమెరుగుల్ని, విలువల్ని వెయ్యింతలు సంతరించుకొని ఇంకా ఇంకా వూరిస్తుంది. అప్పుడనిపిస్తుంది అదెంత అపురూపమో! ఆ థ్రిల్లే వేరేమో! ఆ థ్రిల్లే కావాలనుకొని బోల్తాకొట్టింది మిహిక!

ఇప్పుడెక్కడపడితే అక్కడ దర్శనమిచ్చే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లలో ఒకతె మిహిక. అందం, హంగులూ నిండుగా వున్నాయి. తీరిక వేళల్లో స్నేహితుల్నేసుకుని రెస్టారెంట్లని పోషిస్తుంటుంది. సరిగ్గా ఇప్పుడూ అదే పనిలో ఉంది.



పంజాగుట్టలోని సెవెంత్ హెవెన్లో నలుగురి దోస్తులతో కూర్చుని రకరకాల డిషెస్‌ని ఆర్డరిచ్చే పనిలో బిజీగా ఉంటూనే మాటిమాటికీ తన సెల్ ఎప్పుడు మోగుతుందాని ఆత్రంగా ఎదురుచూస్తోంది. సెల్ మాత్రం నేనేం చెయ్యనన్నట్టుగా మౌనంగా చూస్తున్నట్టుంది టేబిల్‌మీద.

''ఏం మిహీ! ఇంక మొదలుపెడదామా? ఆకలి దంచేస్తోంది. ఆ ఫోనెప్పుడు రానూ, నా క్షుద్బాదెప్పుడు తీరేనూ?'' నాటకీయంగా అంది నటన అనే అమ్మాయి.

''ఊరికే నటించకు. అప్పుడే ఏం ఆకలి? కాస్త ఓపిక పట్టు. శ్రీ ఫోన్ వస్తేకాని ముట్టుకోడానికి వీల్లేదు'' ఖండితంగా చెప్పేసింది మిహిక.

''ఇదెక్కడి గొడవే బాబు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లు ఇలా నోరూ, చేతులూ కట్టేస్తే ఎలా?'' ఏడుపు ముఖం పెట్టింది మోహన.

''ఏంటే మీ గొడవ? అది ముందే చెప్పింది కదా! శ్రీవర్ధన్ శుభవార్తని కన్‌ఫర్మ్ చేసే శుభసమయంలో మనకి ట్రీట్ ఇస్తున్నట్టు. ఆమాత్రం ఓపిక పట్టలేరా?'' కేకలేసింది కోకిల.

వీళ్ళతొందర చూసి మిహికకి కూడా అశాంతి రేగింది. ఈ మహానుభావుండేంటింకా ఫోన్ చెయ్యలేదూ? అస్సలు డిసిప్లిన్ లేదు. చేస్తానన్న టైముకి చెయ్యవచ్చు కదా! ఇడియట్ ఎప్పుడూ ఇంతే!'' మనసులోనే విసుక్కుంది మిహిక.

మిహిక, శ్రీవర్ధన్ ప్రస్తుతం ప్రేమలో తలమునకలుగా ఉన్నారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. వేరు వేరు కంపెనీల్లో పనిచేసేవాళ్ళ పరిచయం తమాషాగా జరిగింది.

ఆరోజు లైఫ్‌స్టైల్ బిల్డింగ్‌లో బైక్ పార్క్ చేస్తున్న శ్రీవర్ధన్‌కి అప్పుడే ఒకమ్మాయి ఆటోవాడితో హోరాహోరీగా పోట్లాడుతూ కనిపించింది. తనే మిహిక. ఆ పక్కనే ఇంకో అమ్మాయి. భయంతో బిక్క చచ్చిపోయి మిహిక చెయ్యి పట్టుకొని వారించే కొద్దీ మిహిక మరింత రెచ్చిపోతూ వాడిమీద మీదకి వెళ్ళి కరవిన్యాసాలు చేస్తూ ఆవేశపడిపోతోంది. చుట్టూ చేరిన వాళ్ళూ కళ్ళప్పగించి తమాషా చూస్తున్నారేగాని కలగ చేసుకొని తగాదా తీర్చేందుకు ముందుకు రావడం లేదు. అది చూసి ఆటో అబ్బాయికి ధైర్యం పెరిగిపోయింది. వాడి కళ్ళల్లో రౌద్రం స్పష్టంగా కనపడుతోంది. అయినా మిహిక జంకలేదు. పోరాటం సాగిస్తూనే ఉంది. ఇదంతా గమనిస్తున్న శ్రీవర్ధన్ గబగబా అక్కడకి

వచ్చాడు. అదే టైముకి ఆటోవాడు మిహిక చెయ్యి తాకి తోసేయడానికి రెడీ అవుతున్నాడు. తక్కున వాడి చెయ్యి పట్టుకొని గట్టిగా మెలిపెట్టేశాడు శ్రీ. ఆరడుగుల విగ్రహాన్ని ఉగ్రరూపంతో చూసిన ఆటోవాడు ఈ హఠాత్పరిణామానికి ఖంగుతిన్నాడు.

అప్పుడొచ్చారందరూ చుట్టూ వున్నవాళ్ళు.

''ఏంటి గొడవ చేస్తున్నావ్? పద ముందు పోలీస్టేషన్‌కి'' ఒక్కలాగు లాగాడు శ్రీ.

''సార్! నేనేం గొడవ చెయ్యలేదు. ఈ అమ్మాయే మీటర్ డబ్బులివ్వను. ఎక్కువైందని రంధి చేస్తున్నాది సార్'' అమాయకం నటించాడు ఆ బక్కవాడు.

''ఏయ్! ఏం మాట్లాడుతున్నావ్? పదిహేను రూపాయలు కూడా అవ్వని దూరానికి పాతిక రూపాయలెలా అయ్యింది? మీటరు ఇష్టమొచ్చినట్టు సెట్ చేసి ప్రజల్ని దోచుకుంటుంది చాలక అబద్ధాలు కూడానా?'' మిహిక మొహమంతా ఎర్ర చేసుకుని మళ్ళీ అరిచింది ఆవేశంగా.

''ఏం? ఏమంటావ్?'' హుంకరించాడు శ్రీవర్ధన్.

''సార్! గొడవలొద్దు. నా డబ్బులిచ్చేయండి'' బతిమిలాడాడు ఆటోవాలా ఆటలు సాగవని కనిపెట్టి.

పర్స్‌లోంచి పదిహేను తక్కున తీసి ''మాట్లాడకుండా వెళ్ళిపో'' అన్నదే తడవుగా దరిదాపుల్లో కనిపించకుండా రయ్యిన పారిపోయాడు ఆటోవాడు చెయ్యి సవర దీసుకుంటూ!

## కొట్టొచ్చిన అందం

**తారలు కొన్ని కొన్నిసార్లు చాలా సెక్సీగా కన్పిస్తారు. అందాలతార కరీనా కపూర్ ఎప్పుడూ అలాగే కన్పించడానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తుందనడానికి ఆమె డ్రెస్‌సెన్స్ అద్దం పడుతుంది. 'తారలకి ప్రధాన ఆకర్షణ డ్రెస్‌కోడ్. అందుకే నేను ఈ విషయంలో ఎంతో శ్రద్ధ కనబరుస్తూ ఉంటాను' అంటోంది కరీనా. డ్రెస్‌ల ఎంపిక విషయంలో ఆమె డిజైనర్ల మాటకు విలువనిస్తోంది. రంగురంగుల డ్రెస్‌లు ఆమె అందాన్ని మరింత పెంచుతున్నట్టున్నాయి.**



ఏం జరుగుతుందో తెలీనంత కోపంలోనూ, ఆవేశంలోనూ ఉన్న మిహికని హెచ్చరించింది పక్కనే ఉన్న నటన అతనికి డబ్బులిచ్చేయమని.

అప్పుడొచ్చింది ఇహలోకానికి మిహిక!

చప్పున బ్యాగ్‌లోంచి డబ్బు తీసుకుని చేతిలో ఉంచి ''చాలా థ్యాంక్స్. అయినా నేను వాడిని పోలీసుస్టేషన్‌కప్పచెబుదామనుకున్నాను. మరీ ఇంత మోసమా! వీళ్ళ ఆగడాలకి హద్దూపద్దూ లేకుండా పోతోంది. ఆటో ఎక్కితే చాలు ఏదో ఒక గొడవ పడక తప్పదు. అందుకే నేను వాటిని అవాయిడ్ చేస్తాను'' ఆటోవాళ్ళ మీద అనర్గళంగా లెక్చరివ్వబోతున్న మిహికని నటన ఆపబోయింది.

''నువ్వుండు. నీకంతా భయమే! ఆ భయాన్నే వాళ్ళు క్యాష్ చేసుకోవాలని చూస్తున్నారు'' విసిరికొట్టింది మిహిక నటనని.

చిరునవ్వుతో మిహికని చూస్తూ ఇంతందమైన అమ్మాయికి ఈ ఆవేశం, కోపం కూడా అందంగానే ఉన్నాయనుకున్నాడు శ్రీ.

''మాల్ మూసేసే టైమైపోవచ్చింది. షాపింగ్ చెయ్యరా ఈ వేళ్టికి?'' టీజింగా అన్నాడు శ్రీ, మిహికనే తదేకంగా చూస్తూ.

''అరే టైమెంత? సరే నండి వస్తాం. ఇంకోసారి థ్యాంక్స్ మీకూ'' అంటూ కదలబోయింది.

''మీ పేరు చెప్పకుండా వెళ్ళిపోతున్నారు. ఇంకోసారిలా ఎప్పుడైనా ఆటోవాడితో గొడవలు పడినప్పుడు నేనాదుకోవాలంటే మీ పేరు తెలియాలిగా''

''నా పేరు తెలుసుకోవాలనుంది మీకు అంతేగా? దానికింత బిల్డప్పెందుకు? నా పేరు మిహిక. దీని పేరు నటన. చాలా?''

''నటన అంటే తెలుసు. మరి 'మిహిక' అంటే అర్థమేంటి?''

''మిహిక అంటే మంచు. మా అమ్మకి హిమాలయాలంటే మహామోజు. అందుకే ఆ పేరు పెట్టుకొంది'' అంది.

''మిహిక అంటే మంచా? మరి మీరేమిటండీ ఇంత వేడిగా ఉన్నారూ?'' చేయి నుదుటి కానించుకుంటూ అన్నాడతను తమాషాగా.

''ఇదెప్పుడూ అంతే. బ్లో హాట్, బ్లో కోల్డ్'' నటన కలగచేసుకుంది.

''ఓ. ఐ.సీ! పేరు మాత్రం బాగుంది. వస్తానండి. వెళ్ళేప్పుడు జాగ్రత్తగా వెళ్ళండి'' వెక్కిరింతగా అంటూ మిహిక రిటార్ట్ ఇచ్చేలోగా మాయమైపోయాడు.

''ఫన్నీగై'' అంటూ భుజాలెగరేసింది మిహి!

ఇంకోసారి మిహిక బైక్ బేగంపేట నడిరోడ్డులో మొరాయిస్తే ఎక్కడనుండో ఆపద్బాంధవుడిలా ప్రత్యక్షమై ఆదుకున్నాడు.

మరోసారి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర పోలీసువాడితో వాదంలోకి దిగబోయిన మిహికని బలవంతంగా లాక్కురావాల్సిన పని పడింది శ్రీకి.

అనుకోకుండా రకరకాల సన్నివేశాల్లో మంచి బాలుడిలా మార్కులు కొట్టేసి ఏకంగా మిహిక హృదయాన్ని కొల్లగొట్టేశాడు. అసలు లైఫ్ స్టైల్ ఆవరణలోనే శ్రీ, మిహికకి మనసర్పించేశాడు.

అలా వాళ్ళ ప్రేమ దిన దిన ప్రవర్ధమానమై పెళ్ళి

ప్పుడు చేసుకుందామనే ప్రపోజల్‌కి రావడానికి ఒక ఏడాది కాలం పట్టింది.

మరి పెద్దల ఆమోదం మాటేమిటనే ప్రశ్న వచ్చింది.

''మా ఇంట్లో నా యిష్టాన్ని కాదనే వారు లేరు'' ధీమాగా చెప్పింది గారాల పట్టి మిహిక.

''అబ్బే! మా ఇంట్లోనూ అంతే. నా మాటే చెల్లుతుంది. నో ప్రాబ్లెమ్'' హీరోలా అన్నాడు శ్రీవర్ధన్.

''మరింకేం త్వరలోనే వివాహ వేడుకలు జరుపుకుందాం'' అంటూ జంటగా అనుకున్నారు.

అప్పటినుండీ వాళ్ళకి కావాల్సిన వస్తువులూ, కొత్త కాపరానికి కావాల్సిన సామాన్లన్నీ కలిపి లిస్ట్ ప్రిపేర్ చేసేసుకుంటుండగా అనుమానమొచ్చింది ద్దరికీ.

''అవునూ. ముందు మన సంగతి మనవాళ్ళకి చెప్పాలి కదా'' అని మిహిక- శ్రీని వాళ్ళింటికి తీసుకెళ్ళి ఆమోద ముద్ర వేయించుకొంది.

మిహిక నాన్నగారు శ్రీవర్ధన్ పేరెంట్స్‌తో మాట్లాడతానన్నారు.

''అప్పుడే అక్కర్లేదంకుల్. ముందు నే వెళ్లి చెబుతాను. తర్వాత మీరూ అంటీ వెళ్దురు గాని. నో ప్రాబ్లెమ్'' అంటూ ఆపాడు.

మిహిక మేఘాల్లో తేలిపోతోంది. ఆరడుగుల అందగాడితో జీవితం పూలరథంలా సాగిపోతుందని సంబరపడిపోయింది. అంతా సవ్యంగా జరిగిపోతోంది అనుకుంటున్న మిహికలో ఏదో మిస్సింగన్న భావం కదలాడసాగింది.

అదేమాట శ్రీతో అంది.

''ఇంకా ఏమిటి? నావాళ్ళు ఒప్పుకోరని సందేహమా? క్వశ్చన్ లేదు. ఏంటి నీ బాధ?'' మిహికని అనురాగంగా చూస్తూ అన్నాడు.

''అవునూ ప్రేమ పెళ్ళిళ్ళంటే బోల్డంత ప్రొటెస్టుంటుంది కదా. కులాలు, గోత్రాలు, మతాలు అంటూ తలల బద్దలు కొట్టుకుంటారు కదా. మన విషయంలో అవేం లేవు. అన్నీ సాఫీగా జరిగిపోతున్నాయి కదూ! ఏదో థ్రిల్ మిస్సవుతున్నట్టు లేదూ? మనం ఒకరికొకరం కావాలనుకున్నాం. అయిపోతున్నాం కదా! నీకు గుర్తుందా నా ఫ్రెండ్ లత, వేణుతో పెళ్ళి కోసం ఎంత తగాదాలు పడాల్సొచ్చిందో. చివరికి అంతా సక్సెస్సై వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకొన్న రోజున చూడాలి దాని సంతోషాన్ని. మహాసామ్రాజ్యాన్ని గెలుచుకున్న విజయోత్సాహం దాని మొహంలో కొట్టొచ్చినట్టు కనపడింది కదా'' కళ్ళింత చేసుకొని చెబుతున్న మిహికని వింతగా చూశాడు శ్రీ.

''నాకు నువ్వెప్పుడు హండ్రెడ్ పర్సెంటర్థమవుతావో తెలీదు మిహీ! సామ్రాజ్యమేమిటో, విజయోత్సాహమేమిటో నాకేం అర్థం కావడం లేదు. ప్చ్! జీవితమంతా ఎలా వేగాలి నీతో'' ఉడికించాడు శ్రీ.

''పోనీ మానేద్దాం! నువ్వు బాగా వేగాలనుకునే మూకుడినే ఎంచుకో ఎంచక్కా'' వెక్కిరించింది.

''అమ్మో! నిన్ను వదిలిపెట్టే ప్రశ్నే లేదు'' భయం నటించాడు.

''చాల్లే గొప్ప! ఇంతకీ మీ వూరు రేపేగా వెళ్ళేది నువ్వు?''

''ఊ! ఇలా వెళ్ళి అలా ముహూర్తం పెట్టించుకొచ్చేస్తా. చూడు'' హుషారుగా అన్నాడు శ్రీ.

''సరే! అలా అయితే ఎల్లుండి లంచ్ టైముకల్లా నువ్వు నాకు ఫోన్ చేసి మీ వాళ్ళ 'ఓకే'ని నాకు చెప్పాలి. సరిగ్గా ఆ టైముకి నేను నా ఫ్రెండ్స్‌తో 'సెవెంత్ హెవెన్'లో లంచ్ ఆర్డరిచ్చి రెడీగా ఉంటాను. నీ ఫోన్ రాగానే నేను సెలబ్రేట్ చేసుకుంటాను. సరేనా?'' సరదాగా ముచ్చటపడింది మిహిక.



''అదేంటి? నేను లేకుండానా?'' మూతి ముడుచుకున్నాడు.

''నువ్వొచ్చాక స్పెషల్ సెలబ్రేషనోయ్ మైడియర్ ఉడ్ బీ గారూ!'' బుగ్గలు సాగదీసింది మిహిక.

''అబ్బా! వదులు ముందు. బొత్తిగా ఈ రోజుల్లో ఆడపిల్లలకి బిడియం లేకుండా పోతోంది'' సణిగాడు.

''ఏ రోజుల్లో ఉన్నావబ్బాయ్. రోజులు మారి చాలా రోజులైపోయింది. తమరే కాలంలో వున్నారండీ''

''రోజులు మారితే ఏంటట? అమ్మాయిలు అమ్మాయిలే! అబ్బాయిలు అబ్బాయిలే. వారు వీరూ, వీరు వారూ అయితే గొడవలైపోతాయి'' అల్లరిగా నవ్వేశాడు.

★ ★ ★

ప్రస్తుతం శ్రీవర్ధన్ చేస్తానన్న ఫోన్ కోసమే కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తోంది మిహిక.

రాను రానూ అసహనం పెరిగిపోతోంది. దానికి తోడు వీళ్ళ 'ఆకలో రామచంద్రా' అంటూ గొడవొకటి.

ఎట్టకేలకి మిహిక సెల్ మోగింది.

మిహిక సెల్‌తో సహా టెర్రస్ పిట్టగోడ దగ్గరకి పరిగెట్టింది.

గుండెల్లో ఉద్వేగం పెరుగుతుండగా అంది ''సెలబ్రేట్ చేసుకోమా?'' అంటూ.

''హలో! మిహీ! ఆర్డరిచ్చేశావా? పోన్లే సరదాగా భోజనం చెయ్యండి'' ఓదార్పుగా అన్నాడు శ్రీ.

''ఏంటలా అంటున్నావ్'' జావగారిపోతూ

## ఐశ్వర్యతో తంటా!

**ఐశ్వర్యారాయ్-అభిషేక్ బచ్చన్‌ల పెళ్లి వార్తలు జోరు జోరుగా ప్రచారంలో వున్నా వాళ్లిద్దరూ మాత్రం కచ్చితంగా ఇదీ అని మాత్రం ఏం చెప్పడం లేదు. అదలా వుంటే- మణిరత్నం కొత్తగా తీయబోయే చిత్రంలో అభిషేక్=ఐశ్వర్యలతోపాటు వివేక్ ఓబెరాయ్ కూడా ఎంపికయ్యాట్ట. మరి నిన్న మొన్నటి వరకూ ఐశ్వర్య కాబోయే భర్తగా ప్రచారంలో వున్న వివేక్‌తో ఐశ్వర్య ఇప్పుడు కలిసి నటిస్తుందా అని బాలీవుడ్ జనాలు చెవులు కొరుక్కుంటున్నారు. తన సినిమాల్లో తన పాత్రలకి తగ్గ తారల్ని ఎన్నుకునే మణిరత్నం మరి ఇప్పుడు ఎలా తన ఆలోచనల్ని మార్చుకుంటాడో?**

అంది మిహి.

''నేను చెప్పేది ఓపిగ్గా విని అర్థం చేసుకో! అమ్మ ఏవో కొన్ని అభ్యంతరాలు చెబుతోంది మన పెళ్ళికి. నేనస్సలు ఊహించలేదిలా జరుగుతుందని మిహీ! ప్లీజ్ అప్‌సెట్టవ్వక. నేను అన్నీ సర్దిచెబుతాను. కాస్త టైమ్ కావాలి. ఒప్పించగలనన్న నమ్మకం నాకుంది. నువ్వీలోగా బెంగపడకూడదు. నామీద ఒట్టు తెలుసా? సరేనా? అన్నట్టు అనుకున్నట్టుగా నేను రేపు రావడం లేదు. మరో నాలుగు రోజులు పట్టొచ్చు.

అయామ్ సారీ మిహీ! నిన్ను నిరుత్సాహ పరిచాను. చాలా డిసప్పాయింటయ్యావు కదూ! నేనన్నీ సర్ది చెబుతాగా. ఉంటాను. బై'' అని ఫోన్ కట్ చేశాడు.

మిహికకి సెవెంత్ హెవెన్‌లోంచి అథఃపాతాళానికి జారిపోయిన ఫీలింగ్ కల్గి అక్కడే వున్న సీట్లో కూలబడిపోయింది.

అయిపోయింది. స్వర్గం చేజారిపోయింది. శ్రీవర్ధన్ కూడా మామూలు అబ్బాయిలా, వాళ్ళ పేరెంట్స్ మామూలు అత్తమామల్లా బిహేవ్ చేస్తున్నారు. ఎన్ని కబుర్లు చెప్పాడు? పెళ్ళనేటప్పటికి అందరి కుర్రాళ్ళా సామాన్యంగా మారిపోయాడు సుమా! తన పక్షంగా ఏమీ వినకుండానే ఫోన్ పెట్టేశాడు కదా! నా గురించేమైనా ఆలోచించాడా అసలు? అసలే వాళ్ళది పల్లెటూరు. చాదస్తాలు చాలానే ఉంటాయి. అభ్యంతరాల్ని వాళ్ళు అంత ఈజీగా వదులుకోరు. ఈ పెళ్ళి జరగడం అపనమ్మకమే! ఎవరో దిష్టి పెట్టారు మా సంతోషానికి. లేకపోతే అన్నీ సవ్యంగా జరిగిపోతోంటే ఈ హఠాత్ అడ్డంకేమిటి?

ఏవేవో ఆలోచనలు నెగటివ్ సైడ్ నుంచి దాడి చేసి మిహికని దుఃఖంలో ముంచెత్తాయి.

'ఇప్పుడెలా? అస్సలు శ్రీలేని లైఫ్‌ని తనేనాడైనా ఊహించగలదా? ఎలా దక్కుతాడు నాకు మళ్ళీ తను?' కన్నీళ్ళు జలజలారాలిపోతున్నాయి.

ఎంతకీ రాకపోతే స్నేహితులు ముగ్గురూ మిహిక దగ్గరికొచ్చేశారు. పరిస్థితి అవగతమైపోయింది వాళ్ళకి.

బతిమాలగా వెక్కిళ్ళమధ్య జరిగిందంతా చెప్పింది మిహిక.

వాళ్ళెంత ఓదార్చినా సమాధానపడలేకపోయింది.

''లేదు. లేదు. నాకేమాత్రం ఆశ లేదు. మీరు శ్రీ మాట్లాడే విధానాన్ని, ఆ టోనునీ వినుంటే ఇలా అనరు'' అంటూ అడ్డంగా తలూపింది.

తినని పదార్థాలకి బిల్ పే చేసి దిగాలు మొహాలేసుకుని వెళ్ళిపోతున్న అమ్మాయిల్ని మేనేజర్ తెల్ల మొహం వేసి చూశాడు.


★ ★ ★

నాలుగు రోజుల్లో వస్తానన్న శ్రీ పత్తాలేడు. సెల్లాఫ్ చేసుంది. వాళ్లాఫీస్‌కి ఫోన్ చేసినా సరైన సమాధానం దొరకడం లేదు. శ్రీ లీవులో ఉన్నాడనొకసారీ, సీటులో లేడనొకసారి చెబుతున్నారు. ఈలోగా మిహిక చిక్కి సగమైపోయింది. దిగులు గూళ్ళు కట్టుకొన్న కళ్ళు కాంతిని కోల్పోయాయి.

దేనీ మీదా ధ్యాస ఉండడం లేదు. యాంత్రికంగా ఆఫీసుకెళ్ళి వస్తోంది. తల్లీ దండ్రీ గమనించారో లేదోగానీ, తనంతట తను చెప్పడానికి అహం అడ్డుపడింది. శ్రీ గురించి అంత గొప్పగా చెప్పి ఇప్పుడిలా అయ్యిందనెలా చెప్పగలదు?

''నీకేం తక్కువే? శ్రీ లేకపోతే బ్రతుకు గడవదా? అసలటువంటి వాడికోసం నువ్వలా బెంగపడ్డమేమిటి? ఇలా మొహం చాటు వేస్తే అయిపోతుందా? మగవాడైతే ఇచ్చిన మాటని నిలబెట్టుకోక్కర్లా? ఇటువంటి కేర్లెస్‌గాళ్ళని నమ్మి నీ జీవితం స్పాయిలవ్వనందుకు ఆనందించు. అయ్యింది చాల్లే. ఆరోగ్యం పాడవ్వడం తప్ప ఏం మిగల్దు'' అంటూ ఫ్రెండ్సంతా కేకలేసినా, బతిమాలినా ఏమాత్రం బెంగపడ్డం మానలేదు మిహిక.

''నాకేం తక్కువా? ఒక్క శ్రీవర్ధనే తక్కువ. అవును నాకన్నీ వున్నాయి. ఒక్క శ్రీ తప్ప. నాక్కావాలతను. కావాలి'' అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న మిహికని ఎవ్వరూ ఓదార్చలేకపోయారు.



ఆఖరుకి స్నేహితులే మిహికా వాళ్ళ పేరెంట్స్‌కి సంగతంతా చెప్పేశారు.

వాళ్ళూ ఎంత ఓదార్చాలని చూసినా అంతకంతకూ దుఃఖం ఎక్కువైందే కాని తగ్గలేదు.

''పోనీ మేం వాళ్ళ వూరెళ్ళి అడుగుతాం'' అన్న తల్లిదండ్రుల మాటలకి రోషపడింది.

''అక్కర్లేదు. మీరేం దేహీ అని సాగిలపడక్కర్లేదు'' అంటూ ఎగిరిపడింది.

''మరైతే ఎందుకీ ఏడుపు? ఊరుకో ఇంక. ఆ చాప్టర్‌కి ఫుల్‌స్టాప్ పెట్టేయ్. అసలు నీ ముఖం అద్దంలో చూసుకో. ఎలా అయిపోయావో తెలుస్తుంది. అది చూసి మేం భరించగలమనుకుంటున్నావా? నిన్న మొన్న పరిచయమైన వాడి కోసం పుట్టిమునిగినట్టు ఏంటో ఈ ఏడుపు?'' గట్టిగానే మందలించారు వాళ్ళు.

''అవును. నిన్న మొన్నే పరిచయు

## భలే ప్రీతీ జింతా!

ప్రీతీ జింతాకి కొత్తగా ఓ అలవాటు మొదలైందిట. అదేంటంటే- ఎదుటి వాళ్ల కనుబొమల్ని సరిదిద్దడం. 'అదేంటో గానీ నా ఎదురుగా వున్న వాళ్ల కనుబొమలు వంకరగా వున్నట్టు కనిపిస్తే తక్కున నా చేత్తో సరిచేయాలనిపిస్తుంది. దీన్ని ఎంత కాదన్నా కంట్రోల్ చేసుకోలేకపోతున్నాను. అఫ్‌కోర్స్! ఇది నలుగురులోనూ బాగోదనుకోండి. ఈ కొత్త సరదాని మెల్లగా మానేస్తాను లెండి' అని ముసిముసిగా నవ్వేస్తోంది ప్రీతీ జింతా.

మయ్యాడు. కాని నాకు తనే సర్వస్వమయ్యాడు. అవుతానన్నాడు. మీకేం అర్థమవుతుంది ప్రేమంటే. ప్రేమిస్తేనే తెలుస్తుంది ఆ బాధేమిటో. పోగొట్టుకోవడంలోని పెయిన్ మీకెలా అర్థమవుతుంది?''

''నీకు బాగానే అర్థమైందనుకుంటాను?'' నవ్వుతూ అన్నాడు గుమ్మం నిండుగా నుంచుని శ్రీవర్ధన్.

అంతా అటు వైపు తిరిగారు ఆశ్చర్యంగా.

మిహిక దుఃఖమంతా కోపంగా మారిపోయింది క్షణాల్లో.

''వెళ్ళిపొమ్మందిక్కడ నుండి'' అంటూ చెయ్యి చూపించింది.

''రాలేదేమని దిగులుపడి ఇప్పుడు వెళ్ళిపొమ్మంటావే? ముహూర్తం పెట్టించుకొచ్చాకదా!'' నవ్వుతూనే అన్నాడు.

''ఏమక్కర్లేదు. మీ వాళ్ళని ఒప్పించడానికిన్నాళ్లు పట్టిందంటే దాన్లోనే తెలుస్తోంది మీ వ్యవహారమంతా'' రోషంగా అంది.

''ఎన్నాళ్ళు పట్టింది? నేను వెళ్ళిన రోజునే ఓకే అన్నారుగా'' చాలా మామూలుగా అన్నాడు శ్రీవర్ధన్.

''ఏమిటి బాబూ? అసలేం జరిగింది? ఏంటిదంతా?'' అయోమయంగా అడిగారు మిహిక నాన్నగారు.

''ఇందులో నా తప్పేం లేదంకుల్. అందరి వైపూ అంగీకారంతో పెళ్ళి జరగడంలో థ్రిల్లు లేదేమోనని మిహీ అంది. ఏదో మిస్సింగంది. తన ముచ్చట నేనెందుకు కాదనాలని చిన్న డ్రామా ప్లే చేశానంతే. ఐయామ్ సారీ అంకుల్. ఆంటీ మీరు కూడా నన్ను క్షమించెయ్యండి. ప్లీజ్.

ఇదంతా మీ అమ్మాయికి ప్రేమలోని విలువని తెలపడానికి చేసింది'' అంటూ మిహిక వైపు చూశాడు ఎక్కడ వచ్చి తన మీద పడి రక్కేస్తుందోనని.


''మీ అసాధ్యం కూలా? ఏం పిల్లలో ఏమిటో. హడలకొట్టారు కదా! అన్నీ వింత ఆలోచనలూ, వింత పోకడలూ.

మా కాలంలో ఇవన్నీ ఎరగం'' అనుకుంటూ వాళ్ళు పిల్లలిద్దర్నీ ఒంటరిగా వదిలి వెళ్ళిపోయారు. శ్రీ- మిహిక వైపు భయం భయంగా చూశాడు. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు ఏ క్షణాన్నైనా పిడిగుద్దులు పడొచ్చని.

మెత్తని చేతులు తనని చుట్టెయ్యగానే కళ్ళు తెరిచాడు.

## ప్రియాంకా పూజలు

మనం కార్తీక పౌర్ణమికి ఎలా పూజలు చేస్తామో అదే రోజున నార్త్‌లో 'కడ్‌వా చౌత్' అని ఆడవాళ్లు పూజలు చేస్తారు. ఈ పూజ ముఖ్య ఉద్దేశం పెళ్లికాని అమ్మాయిలకు మంచి భర్త లభించాలని, పెళ్లయిన వాళ్ల దాంపత్యం బాగుండాలనీ. ప్రియాంకా చోప్రా తన పదహారో ఏటి నుంచే ఈ కడ్‌వా చౌత్ పూజల్ని ప్రతి యేటా ఎంతో భక్తితో ఆరోజున ఉపవాసం వుండి మరీ చేస్తుంటుంది. 'నాక్కాబోయే భర్త ఎక్కడో నాకోసం పుట్టే వుంటాడు. మేము కలిసే సంగతి ఎప్పుడైనా అప్పటి దాకా అతనెక్కడున్నా నా పూజలు ఆయనకి మంచి చేయాలి' అని సిగ్గుపడిపోతుంది ప్రియాంకా.



''బాగా ఏడిపించానా మిహీ?'' అనునయంగా అడిగాడు.

''చాలా! కానీ అదిప్పుడెంతో హాయిగా ఉంది. నీవంటే నాకెంత ప్రేమో తెలిసింది. అది చేయి జారిపోతుంటే ఎంత విలవిల్లాడేనో తెలిసింది. నువ్వు లేని జీవితమెలా ఉంటుందో తెలిసింది. నాకే థ్రిల్లూ వద్దు. కాదు, కాదు, ఈ థ్రిల్లు దుఃఖాన్నే కాదూ, సంతోషాన్నీ తెలిపింది. నేనూ మామూలు అమ్మాయినే అని తెలిసింది. నువ్వంటే యిష్టం వందరెట్లు పెరిగింది'' ఉన్నట్టుండి మాట్లాడ్డం ఆపేసింది.

''ఏమైంది'' అంటూ మిహిక గడ్డం పట్టుకొని అడిగాడు ఆర్ద్రంగా.

''మళ్ళీ ఇదంతా ఇంకో నాటకం కాదుగా?'' అనుమానంగా అడిగింది.

''ఇంకానా? ఇప్పటికే నీ ముచ్చట తీర్చడం కోసం నా రాణిని ఎంత కష్టపెట్టాను! నీ మహా సామ్రాట్టుని గెల్చుకున్నానన్న ఫీలింగ్ కల్గింది కదా! ఇంక మనం పెళ్ళి ప్రయత్నంలో పడదామా మరి. లేక ఇంకా ఏమైనా కోరికలు తీరాల్సినవి వున్నాయా?'' ఆటపట్టించాడు శ్రీ.

''వద్దుబాబోయ్! మహానుభావా? మాటవరసకేదో అంటే ముచ్చట అంటూ ముచ్చెమటలు పట్టించావ్ కదబ్బాయ్! నీ ప్రాక్టికల్ జోక్స్‌కో దండం కాని, నా అత్తమామలేమన్నారో ముందు చెప్పు''

''ఏమంటారు? ఇంతందగత్తె మా యింటి కోడలవుతుందని మురిసిపోతూనే, అటూ ఇటూ అయితే అంతు తేలుస్తుందని భయపడుతున్నారు కూడా'' ఏడ్పించాడు.

మిహిక నీళ్ళు నిండిన కళ్ళలో ఆనందం చమక్కుమంది.

''ఎంత ఎంత ఎడమైతే అంత తీపి కలయికా..'' అంటూ రాగమందుకున్నాడు శ్రీవర్ధన్.

''నీకింత పాత పాటెలా వచ్చు?'' ఆశ్చర్యంగా అడిగింది మిహీ.

''ఎఫ్.ఎమ్.రెయిన్ బో పుణ్యామాని వంటబట్టాయిలే ఈమధ్యే'' అంటూ నవ్వేశాడు ''బాగా పాడానా?'' అంటూ.

''ఆ! బాగా ఆడావు నాటకం కూడా!'' అంటూ మురిపెంగా నవ్వింది మిహిక!

☆